ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ : 04.12.2025 సమయం : 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ రోజు ఆదిలాబాద్ జిల్లాలో పర్యటిస్తున్నారు. సుమారు 260 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేయనున్నారు.

2. వరి కొనుగోలులో రాష్ట్రం కొత్త రికార్డు నెలకొల్పిందని, గడిచిన 48 గంటల్లోనే 7 వేల 887 కోట్ల రూపాయలు చెల్లింపులు చేసినట్లు పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

3. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ వేడుకల్లో భాగంగా ఈ నెల 10 నుంచి ఉచిత ఎగ్జిభిషన్ ఏర్పాటు చేస్తున్నట్లు, పలు ప్రాంతాల నుంచి సందర్శకుల కోసం ఉచిత బస్సులు నడిపిస్తున్నట్లు ప్రభుత్వం తెలియజేసింది.

4. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన హిల్ట్ పాలసీని ఉపసంహరించుకోవాలని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కె. తారక రామారావు డిమాండ్ చేశారు.

-------------------------------

**సీఎం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో ఆదిలాబాద్ పట్టణంలో 260 కోట్ల రూపాయల పైచిలుకు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి

శంకుస్థాపన చేయనున్నారు. వీటిలో ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 49 వార్డుల సమగ్ర అభివృద్ధి పనులు, ఇందిరా మహిళా శక్తి క్రింద స్వయం సహాయక మహిళా సంఘాలతో పెట్రోల్ బంక్ స్థాపనకు శంకుస్థాపన, స్వయం సహాయక సంఘాలకు రుణాల మంజూరు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన, పలు ఉన్నత పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణం, ఆధునికీకరణ వంటి అభివృద్ధి పనులు ఉన్నాయి. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను ఆదిలాబాద్ ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యవేక్షిస్తున్నారు.

**జీఎస్, పీటీసీ - నిర్మల్**

---------------------------

**ఉత్తమ్**

తెలంగాణలో వరి కొనుగోలులో కొత్త రికార్డు నెలకొల్పినట్లు పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఇప్పటివరకు 41.6 లక్షల టన్నుల వరి కొనుగోలు చేయగా.. గడిచిన 48 గంటల్లోనే 7వేల 887 కోట్ల రూపాయలు ఎంఎస్పీగా చెల్లింపులు చేసినట్లు వెల్లడించారు. దీనివల్ల ఏడున్నర లక్షల మంది రైతులకు లాభం చేకూరిందన్నారు. ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 1.26 లక్షల మంది సిబ్బంది పనిచేస్తుండగా.. వారిలో 45% ఐకేపీ మహిళలు ఉన్నారని చెప్పారు. మహిళల సాధికారత పట్ల తెలంగాణ ప్రభుత్వ ప్రాధాన్యతకు ఇది నిదర్శనం అని మంత్రి అన్నారు. ఇప్పటివరకు సన్నరకం కోసం 314 కోట్ల రూపాయల బోనస్ రైతులకు చెల్లించినట్లు ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు.

**జీఎస్**

---------------------------

**ఎగ్జిబిషన్**

ఫ్యూచర్ సిటీలో నిర్వహిస్తోన్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ - విజన్ 2047 కు సంబంధించి పబ్లిక్ ఎగ్జిబిషన్ ఈనెల 10 నుంచి 13వ తేదీ వరకు ప్రజలందరికీ అందుబాటులో

ఉంటుందని ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలియజేసింది. తెలంగాణ భవిష్యత్తు ప్రణాళికలను, గ్లోబల్ విజన్‌ను దగ్గరగా చూసేందుకు ఇందులో అవకాశం ఉంటుందని పేర్కొంది. ఈ ఎగ్జిబిషన్ లో ప్రవేశం పూర్తిగా ఉచితమని వెల్లడించింది. ఇందులో భవిష్యత్తు ప్రాజెక్టుల గురించి సెషన్లు, ప్రభుత్వ నిపుణులతో సంభాషణలు, ప్రభుత్వ శాఖల స్టాల్స్, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని వివరించింది. ఈ ఎగ్జిబిషన్ ను సందర్శించాలనుకునే ప్రజల కోసం ఎంజీబీఎస్, జేబీఎస్, కూకట్‌పల్లి, చార్మినార్, ఎల్ బి నగర్ వంటి ప్రధాన కేంద్రాల నుండి ప్రతిరోజూ ప్రత్యేక ఉచిత బస్సులు కూడా నడిపిస్తున్నట్లు ప్రభుత్వం తెలియజేసింది.

**జీఎస్**

-------------------------

**కేటీఆర్**

కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన హిల్ట్ పాలసీని భారత రాష్ట్రసమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కే తారక రామారావు తప్పుపట్టారు. ఒకప్పుడు ప్రభుత్వాలు ప్రజలు, పరిశ్రమల కోసం, ఉద్యోగ ఉపాధి కల్పన కోసం ఇచ్చిన భూములను ఇప్పుడు ప్రవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేసే ప్రయత్నం చేస్తోందన్నారు. హిల్ట్ పాలసీతో ఇక్కడ ఉన్న కంపెనీలు తరలి వెళ్తే హైదరాబాద్ నగరంలో వాటిపైన ఆధారపడిన లక్షల మంది ఉపాధి పోతుందని అన్నారు. ఈ ప్రయత్నాలను ప్రజలకు వివరించేందుకే ఈరోజు పారిశ్రామిక వాడల్లో పర్యటిస్తున్నట్లు కేటీఆర్ చెప్పారు. దీనిపై త్వరలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. ఈ పాలసీని వెనక్కి తీసుకునే దాకా పోరాటం కొనసాగుతుందన్నారు.

**జీఎస్**

---------------------------------

**ప్రతిపాదన**

హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ నియంత్రణకోసం 34,367 కోట్ల అంచనా వ్యయంతో రీజినల్ రింగ్‌రోడ్డు నిర్మాణపనులు మంజూరుచేయాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదన పంపినట్లు కేంద్ర రహదారి, రవాణాశాఖ మంత్రి నితిన్‌గడ్కరీ తెలిపారు.

ఆయన నిన్న రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ ఎం.అనిల్‌కుమార్ యాదవ్ అడిగిన ప్రశ్నకు ఈ మేరకు సమాధానమిచ్చారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన డీపీఆర్ తయారీ పనులను ఇప్పటికే కన్సల్టెన్సీ సర్వీస్‌కు అప్పగించినట్లు చెప్పారు. ఉత్తర భాగ రీజినల్ రింగ్‌రోడ్డు ఎలైన్‌మెంట్ ఖరారైందని స్పష్టం చేశారు. పీఎం గతిశక్తి నేషనల్ మాస్టర్‌ప్లాన్‌కు అనుబంధంగా ఈ పనులు చేపట్టనున్నట్లు చెప్పారు.

**జీఎస్**

---------------------

**కిసాన్**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం నిధులు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయడంతో పాటు, వ్యవసాయ అవసరాలకు చాలా ఉపయోగపడుతున్నాయని, రాజన్న సిరిసిల్ల జిల్లా నాగయ్య పల్లి గ్రామానికి చెందిన తోట శేఖర్ చెప్పారు. ఆకాశవాణితో ఆయన మాట్లాడుతూ...

**బైట్ - శేఖర్**

**పీటీసీ - సిరిసిల్ల**

-----------------------

**ఆరోగ్యం**

ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా అడుగులు వేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగంపై నిన్న విడుదల చేసిన ప్రగతి నివేదికలో పేర్కొంది. వైద్యులు, పారామెడికల్ సిబ్బంది నియామకం, ఆసుపత్రుల నిర్మాణం, వైద్య కళాశాలలు, నర్సింగ్ కళాశాల సంఖ్యను పెంచడంతో పాటు సీట్లను పెంచినట్లు వివరించింది. రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద ఉచిత వైద్య పరిమితిని 5 లక్షల రూపాయల నుంచి 10 లక్షల రూపాయలకు పెంచినట్లు తెలియజేసింది. ములుగు, నారాయణపేట వంటి మారుమూల జిల్లాల్లోనూ ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులోకి వస్తున్నాయని పేర్కొంది. రెండేళ్లలోనే వైద్యారోగ్యశాఖలో 9 వేల పోస్టులు భర్తీ చేసినట్లు వెల్లడించింది. మరో ఏడు వేల పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపింది. కొత్తగా 9

ప్రభుత్వ వైద్య కళాశాలల ఏర్పాటుతో 450 ఎంబీబీఎస్ సీట్లు పెరిగాయని, 16 నర్సింగ్ కాలేజీల ఏర్పాటు వల్ల అదనంగా 960 సీట్లు అందుబాటులోకి వచ్చాయని, కొత్తగా 28 పారామెడికల్ కాలేజీల ఏర్పాటుతో 1,680 సీట్లు అందుబాటులోకి వచ్చాయని ప్రభుత్వం వివరించింది.

**జీఎస్**

----------------------

**గ్రేటర్**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ విస్తరణ ప్రక్రియ పూర్తయింది. శివారులోని పట్టణ స్థానిక సంస్థలను జీహెచ్ఎంసీ విలీనం చేయాలన్న రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సోమవారం ఆమోదం తెలిపారు. దీంతో మొత్తం 27 స్థానిక సంస్థలను జీహెచ్ఎంసీలో విలీనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. విలీనమైన మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల రికార్డులను స్వాధీనం చేసుకోవాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బాధ్యతను డిప్యూటీ కమిషనర్లు, జోనల్ కమిషనర్లకు అప్పగించింది.

**జీఎస్**

-------------------------

**వేలం**

కోకాపేట నియోపొలిస్ లేఅవుట్ లో నిన్న మూడో విడత నిర్వహించిన వేలంలో ఎకరా భూమి 131 కోట్ల రూపాయలు పలికింది. ప్లాట్ నంబరు 19లో 4 ఎకరాలకు, 20లో 4.04 ఎకరాలకు వేలం నిర్వహించారు. కనీస ధర ఎకరాకు 99 కోట్లుగా నిర్ణయించగా ప్లాట్ 19లో ఎకరా 131 కోట్ల రూపాయలు ధర పలకగా.. .ప్లాట్ 20లో ఎకరా 118 కోట్ల రూపాయలకు విక్రయించారు. ఈ రెండు ప్లాట్లలో కలిసి 996 కోట్ల రూపాయలకు పైగా ఆదాయం సమకూరింది.

**జీఎస్**

------------------------------

**పరిశ్రమలు**

పరిశ్రమలపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి ఆరు పరిశ్రమలపై చర్యలు తీసుకున్నట్లు కాలుష్య నియంత్రణ మండలి నిన్న తెలిపింది. ఈ నెలలో 49 పరిశ్రమలపై వచ్చిన ఫిర్యాదులపై టాస్క్‌ఫోర్స్ సమావేశంలో సమీక్షించామని, ఆరు పరిశ్రమల మూసివేతకు ఆదేశాలు జారీ చేశామని వివరించింది. అందులో స్వర్ణ ప్లాస్టిక్, గాజుల ఉమాకాంత్ ఫ్యాబ్రిక్ డైయింగ్, వెంగమాంబ మైనింగ్ కంపెనీ, సహర్ష ఎన్విరో ప్రైవేట్ లిమిటెడ్, టీఈడబ్ల్యూ ఆటోమేషన్ ప్రైవేట్ లిమిటెడ్, ఆశీర్వాద్ మెటల్ ఇండస్ట్రీలు ఉన్నాయని పీసీబీ ఓ ప్రకటనలో పేర్కొంది.

**జీఎస్**

-----------------------------

**నర్సింగ్**

రాష్ట్రంలోని 1,700 మంది నర్సింగ్ విద్యార్థులకు ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ(ఇఫ్లూ)లో నిన్న జపాన్, జర్మనీ భాషల్లో ఆన్‌లైన్ తరగతులు ప్రారంభమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం పలు నర్సింగ్ కళాశాలల విద్యార్థులు విదేశీ భాషల కోర్సులను నేర్చుకోనున్నారు. 16 నెలల శిక్షణలో ఆంగ్లంతో పాటు జపనీస్ లేదా జర్మన్‌లో ఏదైనా ఒక భాషను నేర్పేలా ఇఫ్లూతో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ఒప్పందం చేసుకుంది.

**జీఎస్**

----------------------------

**కియోస్క్**

విద్యుత్ వినియోగదారులకు మరింత సులువుగా విద్యుత్ బిల్లులను చెల్లించేందుకు ఆన్లైన్ పేమెంట్ సిస్టం కియోస్క్ ను అందుబాటులోకి తెచ్చినట్టు ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ సిఎండి కర్ణాటి వరుణ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. హన్మకొండలోని నక్కలగుట్టలో విద్యుత్

బిల్లుల చెల్లింపు కార్యాలయంలో ఆయన పైలెట్ ప్రాజెక్టు కింద యూనియన్ బ్యాంకు సహకారంతో ఈ విధానాన్ని చేపట్టామన్నారు. దశలవారీగా అన్ని విద్యుత్ బిల్లుల చెల్లింపు కార్యాలయాలలో దీన్ని అందుబాటులోకి తెస్తామని పేర్కొన్నారు. దీంతో వినియోగదారులు బిల్లు చెల్లించడానికి వెళ్లి వరుసలో నిలబడకుండా కియోస్క్ ద్వారా తక్కువ సమయంలోనే పేమెంట్స్ చేయవచ్చని పేర్కొన్నారు.

**పీటీసీ - వరంగల్**

--------------------------------

**సైబర్**

జిల్లావ్యాప్తంగా ప్రజల్లో సైబర్ నేరాల నివారణపై అవగాహన పెంచేందుకు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు, జిల్లా పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో 'ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్' పేరుతో 42 రోజుల పాటు ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను జిల్లా పోలీసు సూపరింటెండెంట్ రోహిత్ రాజ్ విడుదల చేశారు.

**పీటీసీ - భద్రాద్రి**

----------------------------------